క్లుప్తంగా

నేడు మంత్రి రాక

రామాపురం : మండలంలోని గువ్వలచెరువు గ్రామానికి సోమవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వస్తున్నట్లు ఆదివారం మంత్రి పీఆర్‌ఓ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని మండలాల వారీగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌లో ఆయన పాల్గొననున్నట్లు చెప్పారు. సోమవారం జరిగే ప్రజాదర్బార్ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు ప్రజా దర్బార్

పుల్లంపేట : మండల కేంద్రంలోని ఎస్‌వీ కల్యాణ మండపంలో సోమవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ హబీబుల్లా తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పాల్గొననున్నారని, సమస్యలు ఉన్నవారు అర్జీ ద్వారా అందజేస్తే పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు.

నీట్‌లో సీటు సాధించిన సుమశ్రీ



రాజంపేట రూరల్ : పట్టణానికి చెందిన పొత్తపి శ్రీనివాసులు, సుబ్బలక్షుమ్మల కుమార్తె సుమశ్రీ నీట్ పరీక్షలో 581 మార్కులు సాధించింది. దీంతో తనకి తిరుపతిలోని పద్మావతి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందింది. సుమశ్రీకి సీటు రావడంతో తల్లిదండ్రులు, బంధువులు కృతజ్ఞతలు తెలియజేశారు.

అంతర్ రాష్ట్ర కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

రాయచోటి టౌన్ : అంతర్ రాష్ట్ర కరాటే ఆరవ ఛాంపియన్‌షిప్‌లో రాయచోటి విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచి పతకాలు సాధించారు. ఆదివారం ఈ పోటీలు కర్నూల్ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. రాయచోటికి చెందిన లా డ్రాగన్ మార్షల్ ఆర్ట్ అకాడమీ మాస్టర్ దేవేంద్ర కుమార్ ఆధ్వర్యంలో వీరు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో ముగ్గురు విద్యార్థులు గోల్డ్ మెడల్, ముగ్గురు సిల్వర్ మెడల్స్ సాధించారని మాస్టర్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

ఒంటిమిట్ట(సిద్దవటం) : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆయన పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్‌ఆర్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. అంతేగాకుండా ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట మండలం, సిద్దవటం మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ



నాగసుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న ఆకేపాటి

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామానికి చెందిన వైఎస్‌ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు గజ్జల నాగసుబ్బారెడ్డి సతీమణి నరసమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం మాచుపల్లె గ్రామానికి ఎమ్మెల్యే ఆకేపాటి చేరుకుని నాగసుబ్బారెడ్డి పరామర్శించి, మనోధైర్యాన్ని నింపారు. ఆయన వెంట వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు నారపురెడ్డి పుల్లారెడ్డి, రాజారెడ్డి, క్రిష్టారెడ్డి, కె.వి.సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

నేడు ఏయూకు నటుడు ప్రదీప్ రాక

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీకి సోమవారం వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సినీనటుడు కేవీ ప్రదీప్ వస్తున్నట్లు ఏయూ ఛాన్సలర్ డా.చొప్పా గంగిరెడ్డి తెలిపారు. ఏయూలో నిర్వహించే వ్యక్తిత్వ వికాసం సదస్సుకు హాజరుకానున్నట్లు వివరించారు.

సిమెంట్ బెంచీలు ఏర్పాటు



కోనేరు వద్ద ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు కొత్తపల్లికి తలమంచి గిరీష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పది సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. వినాయక స్వామి ఆలయం వద్ద నాలుగు, వెంగతాత మందిరం వద్ద రెండు, కోనేరు వద్ద నాలుగు బెంచీలు ఏర్పాటు చేశారు. ట్రస్టు అధినేత గిరీష్‌రెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో సిమెంట్ బెంచీలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

రైతన్నకు కరువు కోత

- కరుణించని వరుణుడు
- ఎండు దశలో పంటలు
- ఆరుగాలం కష్టపడినా అప్పులు మిగులుతుండటంతో రైతుల దిగాలు
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకోలు



సంబేపల్లె: ముదినేనివాండ్లపల్లెలో ఎండిపోతున్న జామతోట, వేరుశనగను చూపుతున్న రైతు నాగరాజు

సుండుపల్లె : మండలంలోని ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. మండలంలో వ్యవసాయానికి ప్రధానమైన నీటి వనరులు లేకపోవడంతో వర్షాలనే నమ్ముకుని సాగు చేస్తుంటారు. ఈ సంవత్సరం రైతులపై వరుణుడు కన్నెర్ర చేశాడు. వర్షాల జాడ లేకపోవడంతో కరువు విలయతాండవం చేస్తోంది. పంట చేతికి వచ్చే సమయంలో అయినా వరుణుడు చినుకు కురిపిస్తాడేమో అని రైతన్న పెట్టుకున్న ఆశలు అడియాశలే అయ్యాయి. మండలంలో వర్షం పడక వేసిన పంటలు వాడిపోయాయి. దీనికి తోడు భూగర్భ జలాలు అడుగంటడంతో పంటకు తడి అందించలేని దయనీయ పరిస్థితిలో రైతాంగం ఉంది. ఈ సమయంలో వర్షం పడకపోతే రైతులకు పంట దిగుబడి లేకుండా పోయి తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఎక్కువ. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించి, రైతులకు బాసటగా నిలిచేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరి వంద రోజులు గడుస్తున్నా రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం అందించాల్సిన సాయాన్ని ఇవ్వకపోవడంతో రైతులు అప్పులు తెచ్చి సాగును ఆరంభించారు. అటు వరుణుడు ఇటు ప్రభుత్వం తమను విస్మరించడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో రైతులు ఉన్నారు. రెండు వారాలు ఇలానే ఉంటే తమపై అప్పుల భారం పడక తప్పదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మండలంలో పంటల సాగు వివరాలు..

మండలంలో సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో రైతులు 1477 హెక్టార్లలో వ్యవసాయాన్ని సాగు చేసేవారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 557 హెక్టార్లలో మాత్రమే సాగులో ఉంది. గతేడాది వేరుశనగ 927 హెక్టార్లలో సాగులో ఉండగా, ప్రస్తుతం 356 హెక్టార్లలోనే సాగు చేస్తున్నారు. వరి సాగు క్రితం ఖరీఫ్‌లో 279 హెక్టార్లలో చేయగా, ఈ సీజన్‌లో 150 హెక్టార్లలో సాగవుతోంది. అలానే ప్రస్తుతం అలసందులు కేవలం 2 హెక్టార్లలో, సజ్జలు 45 హెక్టార్లలో, ఆముదాలు 0.4 హెక్టార్లలో, టమాటా 4.06 హెక్టార్లలో మాత్రమే సాగు చేస్తున్నారు. మండలంలో సాగు చేయడానికి ఎంత దౌర్భాగ్య పరిస్థితులు ఉన్నాయో ఈ గణాంకాలే చెబుతున్నాయి.

దారుణమైన పరిస్థితుల్లో సంబేపల్లె రైతాంగం

సంబేపల్లె : ఈ ఏడాది మండల రైతాంగాన్ని వరుణుడు నిండా ముంచుతున్నాడు. మండల వ్యాప్తంగా సాగు అనకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. గ్రామ దేవతలకు పూజలు చేసినా.. అమ్మవారికి జలాభిషేకాలు జరిపిన చినుకు జాడలేదు. దీంతో మండలంలో సాగు చేసిన రైతులకు ప్రకృతి కన్నీరే మిగిలిలా చేసింది. కాగా మండలంలో సాధారణ వేరుశనగ సాగు 5370 ఎకరాలుగా ఉండగా ప్రస్తుతం అది 1700 ఎకరాలకు పడిపోయిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మిగులు సంగతి పక్కనబెట్టి పెట్టిన పెట్టుబడి కూడా దక్కని సందర్భంలో రైతాంగం ఉంది. కాగా మండలంలో సాగులో పలు పంటల వివరాలు ఇలా ఉన్నాయి. వరిపంట సాధారణ సాగు విస్తీర్ణం 1042 ఎకరాలు కాగా ప్రస్తుతం 625 ఎకరాలు, కంది సాధారణ విస్తీర్ణం 292 ఎకరాలుగా ఉండగా ప్రస్తుతం 136 ఎకరాల్లోనే సాగు అవుతోంది.

లబోదిబోమంటున్న చిన్నమండెం రైతులు

చిన్నమండెం : మండల వ్యాప్తంగా రైతులు సాగు చేసిన వేరుశనగ ఎండుతోంది. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు సాగు చేసిన పంట ఎండుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండల పరిధిలోని మల్లూరు గ్రామం రోడ్డువారపల్లెకు చెందిన రైతు కుమార్ తనకున్న 3 ఎకరాలలో వేరుశనగ పంటను సాగు చేశారు. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంట పూర్తిగా ఎండిపోయింది. చేతికొచ్చిన పంట ఇలా ఎండిపోతుండటంతో రైతు కుమార్ దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని మండల రైతాంగం వేడుకుంటోంది.

విత్తనాలు పుడిమి పాలు.. రైతన్నలు అప్పుల పాలు

రామాపురం : వర్షాలు పలుచోట్ల కుంభవృష్టిగా కురుస్తోంది. మరో ప్రాంతంలో చినుకు భూమి మీద పడక రైతులు కన్నీళ్లు కార్చే దుస్థితి కనిపిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు వర్షాధార పంటలైన వేరుశనగ, కంది, ఉలవ, పొద్దుతిరుగుడు వంటివి విత్తుకుంటారు. మండల రైతాంగం కేవలం వర్షాధార పంటలపై ఆధారపడి జీవించే వారే. ఎక్కువ శాతం బావుల్లో నీరు అడుగంటి పోవడంతో కాలువలు, చెరువులు పూర్తిగా ఎండిపోవడం రైతులు అనావృష్టి వల్ల దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ఈ ఏడాది రైతులు ఖరీఫ్ సీజన్‌లో తాము నమ్ముకున్న పంటలైన వేరుశనగ పుడమిలో వేశారు. రైతులు భూమిలో విత్తనాలు వేసినప్పటికి ఇంతవరకు సరైన ఒక్క పదును వర్షం కురకపోడంతో మొలకెత్తిన వేరుశనగ పంట పూర్తిగా ఎండిపోయే పరిస్థితి చేరుకుంది. ప్రతి ఏడాది రైతులు జూన్ నెలలో తాము విత్తనాలను కొనుగోలు చేసి జులై నెలలో కురిసే వర్షాలకు విత్తనాలను భూమిలో వేస్తారు. మూడు నెలలో ఈ పంట చేతికి అందుతుంది. వర్షాలు సక్రమంగా కురిస్తే ఐదు, ఆరు రోజులలో పంట చేతిలోకి వస్తోంది. అలాంటిది ఈ ఏడాది విత్తనాలు భూమిలో వేసినప్పటి నుండి ఇంత వరకు చినుకు రాలకపోవడంతో మొలకెత్తిన విత్తనాలు అలాగే ఎండిపోయాయి. అక్కడక్కడ వేసుకున్న వరి పంటలు సైతం పూర్తిగా నీళ్ల లేక ఎండిపోయాయి. కంది, ఉలవ వంటివి దెబ్బతిన్నాయి. ప్రతి రైతు తమ శక్తి కొద్ది వర్షాధార పంటలను వేసుకుంటూ వస్తున్నారు. ప్రతి ఏడాదిలాగా ఈ ఏడాదీ వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో ఉన్న రైతులకు నిరాశే ఎదురైంది. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



రామాపురం: మండలంలో సాగు చేసిన పొలంలో ఎండిపోయిన కంది పంట



సుండుపల్లె: పూజారివాండ్లపల్లెలో వాడిపోయిన ఆముదం చెట్లు



సుండుపల్లె: బండకాడ ఈడిగపల్లెలో వేరుశనగ పంట దుస్థితిని చూపుతున్న రైతు

ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి



నేను ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాన్ని నమ్ముకొని నాలుగు ఎకరాలు వేరుశనగ, 3 ఎకరాలు సజ్జ పంటలను సాగు చేస్తున్నాను. అయితే పంట చేతికి వచ్చే సమయంలో వర్షం పడక చెట్లన్నీ వాడిపోయి ఎండిపోయే స్థితికి వచ్చాయి. వ్యవసాయానికి అప్పుచేసి పంటలను సాగు చేశాను. ఈ సంవత్సరం సాగుకు అన్ని ప్రతికూల పరిస్థితులే ఎదురయ్యాయి. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– రెడ్డిచెర్ల మనోహర్, రైతు, సుండుపల్లె

అప్పుతెచ్చి పెట్టుబడి పెట్టాం



వర్షాలను నమ్ముకుని నాలుగు ఎకరాలలో జామ, మూడు ఎకరాలలో వేరుశనగను సాగు చేశాను. వర్షాలు లేక బోరులోని నీరు పూర్తిగా అడుగంటడంతో వేసిన పంటకు తడి ఇచ్చుకోలేక అవస్థలు పడుతున్నాం. అప్పుతెచ్చి పెట్టిన లక్షల పెట్టుబడి రాని పరిస్థితి కనిపిస్తోంది. వర్షాలు కురుస్తాయన్న నమ్మంతో వేసిన పంటలు నిండాముంచాయి. ప్రభుత్వం ఆదుకోకుంటే తమ గతి వర్ణణాతీతం.

– నాగరాజు, ముదినేనివాండ్లపల్లె, సంబేపల్లె మండలం

వృద్ధాప్యంలో కంటిచూపు చాలా అవసరం



మాట్లాడుతున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు వెంకటసుధీర్, సాయిలక్ష్మిలు

- ఆకేపాటి ట్రస్ట్, అరవింద్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం
- ప్రారంభించిన ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

ఒంటిమిట్ట(సిద్దవటం) : ప్రతి ఒక్కరికీ కంటి చూపు అనేది చాలా అవసరమని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన ఒంటిమిట్ట జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఆకేపాటి ట్రస్టు, ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి అరవింద కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కంటి వైద్యులు డాక్టర్ వెంకటసుదీర్, డాక్టర్ సాయిలక్ష్మిలు 130 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 27 మందికి ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ వైద్య సేవల పరంగా ఇప్పటి వరకు ఎక్కువ క్యాంపులను నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరికీ కంటి చూపు తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. వృద్ధాప్యంలో కంటి చూపు లేకుంటే పిల్లలకు ఏదైనా పని చెబితే వారు విసుక్కుంటూ ఉంటారన్నారు. అందుకని కంటి చూపు బాగుంటే మీరు జీవించినంత కాలం వేరేవారిపై ఆధారపడకుండా మీ పనులు మీరే చేసుకుంటారని ఆయన అన్నారు. అనంతరం వైద్య శిబిరానికి వచ్చిన వారికి ఎమ్మెల్యే భోజనం ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో అరవింద ఆసుపత్రి మేనేజర్ మనోహర్‌రెడ్డి, ఒంటిమిట్ట సర్పంచ్ సుజాత, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు జబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, వెంకటశేషారెడ్డి, వెంకటశివారెడ్డి, నందకిషోర్‌రెడ్డి, నారాయణరెడ్డి, వల్లిబాస్, భాస్కర్‌రెడ్డి, కె.వి. సుబ్బయ్య, గోపాలస్వామి, మల్లేశ్వర్‌రెడ్డి, జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, చేపూరి ఓబయ్య, జానకిరామయ్య, మేరువ ప్రసాద్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సంబేపల్లె: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



పుల్లంపేట: విరాళం అందజేస్తున్న దాతలు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు జరిపి విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని భీజాక్షారాలు ఉన్న మహిమగల రాయిపై పొర్లుదండాలు పెట్టారు.

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానది ఒడ్డున వెలసిన శ్రీ మల్లూరమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. మొక్కులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆలయానికి విరాళం అందజేత

పుల్లంపేట : రెడ్డిపల్లి హరిజనవాడలో నూతనంగా నిర్మించిన మాతమ్మ ఆలయానికి ఆదివారం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువనాయకుడు రొంపిచెర్ల లక్ష్మీనారాయణ, ఆయన సతీమణి అనిత ఆదివారం మాతమ్మతల్లి ఆలయానికి రూ. 20 వేలు అందించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అంబేడ్కర్‌ను అవమానించడం హేయం

పీలేరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌ను, దళిత మెడికల్ ప్రొఫెసర్‌ను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నియోజవర్గ ఉపాధ్యక్షుడు టి.ఎల్. వెంకటేష్ డిమాండ్ చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌ను, దళిత మెడికల్ ప్రొఫెసర్‌ను అవమానించిన వారిపై కేసు నమోదు చేయాలని ఆదివారం పీలేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా పోలీసులు తిరస్కరించడంతో ఫిర్యాదు కాపీలు చింపి నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణమరాజు అంబేడ్కర్ బ్యానర్ తొలగించి అవమానించడంహేయమైన చర్య అని పేర్కొన్నారు. అలాగే జనసేన ఎమ్మెల్యే నానాజీ, దళిత మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్‌పై దాడి చేసి దుర్భాషలాడారన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నరసింహులు, సదాశివ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

సుండుపల్లె : మండల కేంద్రంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల నిర్వహించగా ఇద్దరు వాహనదారులు మద్యం సేవించి వాహనం నడుపుతుండటంతో కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడపరాదని, వాహనదారులు హెల్మెట్‌తోపాటు లైసెన్సు, ఆర్‌సీ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేటప్పుడు ప్రమాదాలు జరిగితే తమ కుటుంబ సభ్యులు అనాథులుగా మిగులుతారనే వాస్తవాన్ని తెలుసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినంగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా ఎస్ఐ తెలియజేశారు.

సౌమ్యనాథుడి క్షేత్రంలో నటుడు లక్ష్మణ్



సినీ యాక్టర్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నందలూరు : మండల కేంద్రంలోని శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయాన్ని ఆదివారం ఆర్ఎక్స్ 100, భీమ్లా నాయక్ తదితర సినిమాలలో నటించిన సినీ యాక్టర్ లక్ష్మణ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ విశిష్టత గురించి తెలుసుకున్నారు. ఆలయ నిర్వాహకులు లక్ష్మణ్‌ను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పొలంలో మోటారు సర్వీస్ వైరు చోరీ

వీరబల్లె : మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీ సిటికె తొకటపల్లికి చెందిన టేకూరి పద్మావతికి చెందిన పొలంలో ఉన్న మోటారు సర్వీస్ వైరును శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో బాధితురాలు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మోటార్ సైకిల్..

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని నరసరాంపేటకు వాస్తవ్యుడు ఆర్.సుబ్బారావుకు చెందిన ఏపీ39 ఆర్‌డీ 3376 నెంబర్ కలిగిన మోటార్ సైకిల్ ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బంధువుల ఊరికి వెళుతూ ఇంటి వద్ద పెట్టి బీగాలు వేసినప్పటికీ చోరీకి గురైందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సుండుపల్లె : మండల పరిధిలోని ఎర్రమనేనిపాలెం పంచాయతీ ఎర్రమనేని పాలెం దక్షిణ భాగాన పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులతోపాటు సిబ్బంది పేకాట స్థావరంపై దాడి చేశారు. అక్కడ జూదమడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ. 16,600లు నగదు స్వాధీనపరుచుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు.

తహసీల్దార్‌లను నియమించకపోవడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు కావస్తున్నా రైల్వేకోడూరు నియోజకవర్గంలో పలు మండలాలకు తహసీల్దార్‌లను నియమించలేకపోవడం సిగ్గుచేటని ఏఐటీయూసి జిల్లా అధ్యక్షులు తుమ్మల రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పండుగోలు మణిలు విమర్శించారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ తహసీల్దార్‌లు లేకపోవడంతో భూ బకాసురులు విచ్చలవిడిగా భూములు ఆక్రమించుకుంటూ ఆన్‌లైన్‌లు చేసుకుంటున్నారని ఆరోపించారు. 100 రోజులు కావస్తున్నా ఇంకా ఎందుకు తహసీల్దార్లు నియమించలేదో కూటమి నాయకులు జవాబు చెప్పాలన్నారు. దళిత, గిరిజన, దేవదాయ శాఖ, ప్రభుత్వ, వంక పరంబోకులు, ఆర్అండ్‌బీ తదితర భూములను నాయకలు, పెత్తందారులు ఆక్రమించుకొంటున్నారని చెప్పారు. దోచుకున్నవాడికి దోచుకున్నంత అన్న చందంగా కూటమి నాయకుల తీరు తయారైందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామని తెలిపారు. అణగారిన వర్గాలకు అన్యాయం జరిగితే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మొగిలి వినయ్, జయరామయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిలో బోరు



ప్రభుత్వ భూమిలో బోరువేసిన ఆక్రమణదారుడు

పుల్లంపేట : మండల పరిధిలోని వత్తలూరు గ్రామ పంచాయతీ సర్వేనెంబరు – 1138లో కావేటి తిరుపయ్య మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నాడు. సదరు భూమిలో ఆదివారం కావడంతో యథేచ్ఛగా బోరువేశాడు. గతంలో ఈ భూమి అసైన్మెంట్ కమిటీలో పేదలకు పంచేందుకు గత ప్రభుత్వంలో జిల్లా కలెక్టర్ నివేదికలు పంపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఆక్రమణదారుడు భూమిని ఆక్రమించుకొని పంటలు సాగు చేస్తున్నాడు. చెరువు అలుగు పోరంబోకు సైతం ఆక్రమించుకున్నాడని గ్రామస్తులు తెలియజేశారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ వివరణ కోరగా ఆక్రమణదారుడుపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అపుస్మా నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

రాజంపేట రూరల్ : ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోషియేషన్(అపుస్మా) రాజంపేట పట్టణ శాఖకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక శ్రీసాయి విద్యాలయ హైస్కూల్‌లో ఆదివారం అపుస్మా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ ఎన్నికకు ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు గంగయ్య, ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్యలు పాల్గొని ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అధ్యక్షులుగా శ్రీవిద్యానికేతన్ కరస్పాండెంట్ అబ్బూరి ప్రభాకర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కింగ్ బ్రిడ్జ్ స్కూల్ కరస్పాండెంట్ కె.సుభాష్, కోశాధికారిగా రెయిన్‌బో స్కూల్ కరస్పాండెంట్ ఎస్.రవీంద్రనాయుడు, ఉపాధ్యక్షులుగా శాన్వీ స్కూల్ కరస్పాండెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు, షిరిడీసాయి రెయిన్‌బో స్కూల్ కరస్పాండెంట్ గురజాల రెడ్డెయ్యనాయుడు, సహాయ కార్యదర్శులుగా అమరావతి స్కూల్ కరస్పాండెంట్ వెంకటసుబ్బయ్య, ఐడియల్ స్కూల్ కరస్పాండెంట్ నవాజ్‌ఖాన్, లీగల్ అడ్వైజర్‌గా బీఎస్ స్కూల్ కరస్పాండెంట్ బాసినేని రమేష్‌నాయుడులను ఏగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో అన్ని ప్రైవేటు విద్యా సంస్థల కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన రెడ్డెమ్మకొండ



సంతానం కోసం వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతాన ప్రసాదించే తల్లిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచే భక్తుల సందడి మొదలైంది. తడిబట్టలతో అమ్మవారి ముందు సంతానం కోసం మహిళలు వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీర సారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు.